రోడ్లు ధ్వంసం రాకపోకలకు కష్టం

- మరమ్మతుకు నోచుకోని వైనం
- రోజూ 14 కిలోమీటర్లు నడుస్తూ బడికెళ్లి చదువుకుంటున్న విద్యార్థులు
- వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



గర్రెపల్లి కల్వర్టు వాగులో దిగబడిన స్కూల్ వ్యాన్‌ను ట్రాక్టర్‌తో లాగుతున్న దృశ్యం

సైదాపూర్: మట్టి రోడ్లు మరమ్మతులకు నోచుకోక ఏటా వర్షాకాలంలో కోతకుగురవుతున్నాయి. దీంతో ఇతర గ్రామాలకు రాకపోకలు నిలిచినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతీ సంవత్సరం వానాకాలంలో ఆయా గ్రామాల ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. తెగిన రోడ్లతో ప్రాణాలు పోతున్నా పాలకులకు కనికరం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సోమారం గ్రామ పంచాయతీ పరిధిలోని గర్రెపల్లి నుంచి సైదాపూర్ మట్టిరోడ్డు మధ్యలో పొల్కమ్మ చెరువు వాగుపై నిర్మించిన కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగింది. దీంతో గర్రెపల్లి నుంచి మండల కేంద్రంసైదాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. గర్రెపల్లి గ్రామస్తులకు విద్యా, వైద్యంతో పాటు ప్రతి పనికి నిత్యావసరాలకు సైదాపూర్ వెళ్లాల్సిందే. అలాంటిది నెల రోజులు గడుస్తున్నా రోడ్డు మరమ్మతులు చేయించకపోవడంతో బడికి వెళ్లాల్సిన చిన్నారులు గర్రెపల్లి – సోమారం నుంచి సైదాపూర్‌కు ఉదయం, సాయంత్రం 14 కిలోమీటర్లు నడిస్తేనే బడి భాగ్యం కలుగుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పనికి 14 కిలోమీటర్లు రోజుకు పదిసార్లు పోతే పొద్దు గడుస్తుందని పాలకులు, అధికారులు కనీస మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. జీపీ పాలకులు, అధికారులు గర్రెపల్లితో సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

మరమ్మతు చేయాలి



నెలలు గడుస్తున్నా పంచాయతీ పాలకులు, అధికారులు రోడ్డు మరమ్మతులు పట్టించుకోవడం లేదు. తట్టెడు మట్టి పోసి గండ్లు పూడ్చాలి. ఐదేళ్లుగా గర్రెపల్లిలో వసూలు చేసిన పన్నుల పైసలు ఖర్చు చేయాలి. ఏళ్లుగా గర్రెపల్లి వివక్షకు గురవుతోంది. పంచాయతీలో గర్రెపల్లి లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. మండలంలో మిగతా గ్రామాల్లో వర్షాలు కురువలేదా? అక్కడ ఇలాంటి సమస్యలుంటే పాలకులు పరిష్కరించటం లేదా? ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయాలి.

– వేముల కొమురయ్య, గర్రెపల్లి

క్లుప్తంగా

అందుబాటులో యూరియా

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో నిర్మించిన గోదాంలో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ కామిడి శ్రావ్య శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సుమారు 270 బస్తాలు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,పూర్తి వివరాలకు 9396712371 నంబర్ సంప్రదించాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత

వీణవంక: మండల కేంద్రానికి చెందిన ఓరెం శంకరయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి ట్యూరిటో, యూప్ టీవీ సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి రూ.ఐదువేలు అనుచరుల ద్వారా అందించారు. కార్యక్రమంలో సమిండ్ల చిట్టి, సునిల్, భోగం అశోక్, వీరాస్వామి, సురేశ్, దాసారపు లోకేశ్, శేఖర్, చిన్నాల శ్రీకాంత్, తాళ్లపల్లి కుమారస్వామి, వస్తం కుమార్, దాసారపు వంశీకృష్ణ, తోట్ల రాకేశ్, ధనరాజ్ తదితరులు ఉన్నారు.

నియామకం



వెంకన్నను సన్మానిస్తున్న చల్లా హరిశంకర్

గన్నేరువరం: మున్నూరుకాపు సంఘం మానకొండూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన గంప వెంకన్న నియామకమయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ శనివారం కరీంనగర్‌లో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహకారంతో నియోజకవర్గంలో సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఆపదలో అండగా ఉంటా..



ఆర్థికసాయం అందిస్తున్న సర్పంచ్ రమేశ్

తిమ్మాపూర్: ఆపదలో గ్రామస్తులకు అన్నివిధాలుగా అండగా ఉంటానని రామకృష్ణకాలనీ సర్పంచ్ మీసాల అంజయ్య అన్నారు. గ్రామానికి చెందిన దాసరి సర్వయ్య, రేవెల్లి సంపత్, గంధం అంజి మరణించడం బాధాకరం అన్నారు. శనివారం వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. ఎవరికి ఆపద వచ్చినా అండగా ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు దావు సంపత్ రెడ్డి, వార్డు సభ్యులు సిరికొండ అంజన్ రావు, తూర్పాటి అజయ్ నాయకులు కిన్నెర అంజి, ఇనుకొండ నరేశ్, తదితరులు ఉన్నారు.

దుద్దెనపల్లి గ్రామ పంచాయతీకి బాడీఫ్రీజర్ బహూకరణ



బాడీఫ్రీజర్ బహూకరిస్తున్న క్లబ్ సభ్యులు

సైదాపూర్: వరంగల్ లయన్స్ క్లబ్ ద్వారా వరంగల్ విద్యుత్‌శాఖ సీఈ కామినేని తిర్మల్ రావు శనివారం దుద్దెనపల్లి గ్రామ పంచాయతీకి బాడీఫ్రీజర్ బహూకరించారు. ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో స్థిరపడి స్వగ్రామంపై మమకారంతో బాడీఫ్రీజర్ బహూకరించిన తిర్మల్‌రావును గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, తహసీల్దార్ మంజుల, ఎస్‌ఐ ఆరోగ్యం, సర్పంచ్ యుగేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ హరీశ్, మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజయ్య, వీరన్న, రాజేందర్, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌లు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్నా భౌతి కశాస్త్ర అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ శనివారం ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక పద్ధతిలో గంటల ప్రాతిపదికన బోధించేందుకు ఆసక్తి, అర్హతగల స్థానిక అభ్యర్థులు 21వ తేదీలోపు సంబంధిత ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్‌కు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

వీణవంక: తహసీల్దార్ తిర్మల్‌రావును కార్యాలయంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకలు పంజాల సతీశ్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. సాధారణ బదిలీల్లో భాగంగా తిర్మల్‌రావు జగిత్యాల జిల్లా నుంచి వీణవంకకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు.

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి

చిగురుమామిడి: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొత్త వినీత అన్నారు. శనివారం చిగురుమామిడి బస్టాండ్ ఆవరణలో జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని ఓట్ ఫర్ షూర్ అనే నినాదంతో 5కే రన్ ప్రారంభించారు. బతుకు దెరువుకు ఎక్కడికి వెళ్లినా తప్పని సరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ ఇట్టి నరేందర్, ఎస్సై సామల రాజేశ్, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, మండల పరిషత్ సూపరింటెండెంట్ ఖాజామొయినొద్దీన్, ఆర్‌ఐలు పూదరి రాజు, శైలజ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, యువత పాల్గొన్నారు.



సైదాపూర్‌లో 5కే రన్ ప్రారంభిస్తున్న తహసీల్దార్ మంజుల, ఎస్‌ఐ, తదితరులు

సైదాపూర్: ఎన్నికల అధికారుల ఆదేశం మేరకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో అధికారులు, రాజకీయ నాయకులతో 5కే రన్ కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని తహసీల్దార్ దూలం మంజుల పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆరోగ్యం, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కూతురు విద్యాన్ రెడ్డి, సామాజిక కార్యకర్త కుమార్‌రాజా, పోలోజు రాజు, మధుసూదన్‌రెడ్డి, బీఎల్వోలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్: నియోజకవర్గ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిర్వహిస్తున్న తొలిపొద్దు కార్యక్రమం శనివారం వర్షంలోనూ కొనసాగింది. మండలంలోని రేణికుంట గ్రామంలో ఉదయం పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందిరానగర్‌లో ఎస్‌బీఐ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరారెడ్డి, సర్పంచలు వినోద, కొముురయ్య, వార్డు సభ్యులు ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

సమాజంలో మహిళల పాత్ర కీలకం

హుజూరాబాద్‌రూరల్ : సమాజంలో మహిళల పాత్ర కీలకమని బ్రహ్మకుమారి రాజయోగిని మనీషా అన్నారు. శనివారం మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళలకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు లేని సమాజం ఊహించుకోలేమని, మహిళలు మరింత సమర్థవంతంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జమ్మికుంట సెంటర్ ఇన్‌చార్జి బ్రహ్మకుమారీలు నిర్మల, లక్ష్మీ, హుజూరాబాద్ సెంటర్ ఇన్‌చార్జి బ్రహ్మకుమారి ప్రణీత తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రాజయోగిని మనీషా

పాలనలో సీఎం కేసీఆర్ విఫలం

గంగాధర: రాష్ట్రం ఏర్పడితే ఎలాంటి బాధలు ఉండవని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ పాలనలో విఫలమయ్యారని బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు నల్లాల రాజేందర్ విమర్శించారు. బహుజన్ సమాజ్ పార్టీ గంగాధర మండల కమిటీ ఆధ్వర్యంలో మనసీఎం మనఆర్‌ఎస్పీ కార్యక్రమంలో భాగంగా శనివారం గర్శకుర్తి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ ఎప్పుడు జనంలో ఉండే నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అవకాశం ఇస్తే ప్రజల సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పొత్తూరి సురేష్, హనుమంతు రమేష్, నెల్లి మహేశ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో నాయకులు

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ప్లేట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు దేవసాని సురేశ్, అనుమల్ల సాయిచరణ్, దుస్సాసాగర్ పిల్లలకు ప్లేట్లు సమకూర్చారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు సాఫ్ట్‌వేర్‌ఉద్యోగులను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు రోజారమణి, రమేశ్, బాబు, ఆదిలక్ష్మి, భాగ్యలక్ష్మి, జ్యోతి, మంగ, శారద ఉన్నారు.



ప్లేట్లు పంపిణీ చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

పాఠశాలల్లో వైద్యశిబిరం



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

ఇల్లందకుంట: మండల పరిధిలోని కేజీబీవీ, రాచపల్లి, కనగర్తి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తులసిదాస్ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కుదిషియా, డాక్టర్లు మొగిలి, అఖిల, హెల్త్‌ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమాదేవి, ప్రధానోపాధ్యాయులు ఆశ, రాణి తదితరులు పాల్గొన్నారు.

కొక్కెరకుంటలో గర్భిణులకు సీమంతం



సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారులకు తల్లిపాలు తాగిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అంజలి, కనకలక్ష్మి, వసంతలక్ష్మి పలువురు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు పంపిణీ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన గుడ్ల స్వరూప–రవీందర్ కూతురు పెళ్లికి శనివారం బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు పుస్తెమట్టెలు అందజేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనిల్, సమ్మిరెడ్డి, జైపాల్, నరేందర్, సారయ్య, సాగర్, సతీశ్, మల్లేశం, శ్రీనివాస్ ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



వినతిపత్రం అందిస్తున్న ఔట్ సోర్సింగ్ జేఏసీ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద రాష్ట్ర అవుట్ సోర్సింగ్ జేఏసీ పిలుపు మేరకు మున్సిపల్ జేఏసీ నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ జేఏసీ నాయకులు డి. రాజేందర్, సారయ్య, రాజు, సంపత్, సదశివారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పాషా, నందు, రాజేందర్, కుమార్, సరోజన, రజిత, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

గన్నేరువరం: మండల కేంద్రానికి చెందిన ఎవర్ గ్రీన్ యూత్ యువకులు శనివారం డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సునీల్, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి దేవరాజ్ అనిల్, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి అనిల్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కొమురయ్య, మండల అధ్యక్షుడు మల్లేశం, మానకొండూర్ అసెంబ్లీ యూత్ కార్యదర్శి నవీన్, మండల యూత్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, అనిల్‌కుమార్, అభిలాశ్ పాల్గొన్నారు.

కొత్తగట్టు శివారులో రెండు కార్లు ఢీ

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామ శివారులో శనివారం రాత్రి రెండు కార్లు ఢీకొన్నాయి. కొత్తగట్టు–సింగాపూర్ గ్రామాల మధ్య ఏర్పడిన గుంతలతో ముందు వెళ్తున్న కారును మరో కారు వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో కారులోని ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో ఎవరికీ గాయాలు కాకుండా ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడినట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని మొలంగూర్ క్రాస్‌రోడ్డు వద్ద ద్విచక్రవాహనం పైనుంచి పడటంతో ఒకరికి తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

- ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని జమ్మికుంట, చొప్పదండి, చిగురుమామిడి, మానకొండూర్, శంకరపట్నం మండలాల్లో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణ, మండల ఫొటోగ్రఫీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.

‘సెంట్రల్’ పనులు బ్రేక్

- నిబంధనలు పాటించాలని ధర్నా
- వారంలో రెండోసారి పనులు నిలిపివేత



ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న ఇళ్ల యజమానులు

చొప్పదండి: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులకు మళ్లీ బ్రేక్ పడింది. వారం వ్యవధిలో డ్రైనేజీ తవ్వకానికి చేపట్టిన జేసీబీ పనులను శనివారం నిలిపివేశారు. తమవైపు అదనంగా భూమి కోల్పోవాల్సి వస్తోందని మాజీ జెడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య ఆధ్వర్యంలో స్థానికులు అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించగా గృహ యజమానులతో పాటు మహిళలు, యువకులు పాల్గొన్నారు. రోడ్డుకు రెండోవైపు యజమానులు కూడా రోడ్డుపైకి చేరుకొని పనులు నిలిపివేయడంపై నిరసన తెలిపారు.

రెండోసారి..

అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం పనులు ప్రారంభించగా కొన్ని నిమిషాల్లోనే కందకం తవ్వకం నిలిపివేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు అధికారులు సమావేశమై చర్చించారు. రోడ్డు మార్కింగ్ ప్రకారం సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాలని, ఇప్పటివరకు తొంభై శాతం పనులు మార్కింగ్ ప్రకారం జరిగాయని, ఇప్పటికే పలువురు ఇళ్లను కూడా కోల్పోయారని, ఇప్పుడు నిబంధనలు మారిస్తే విమర్శలు వస్తాయని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మార్కింగ్ ప్రకారం డ్రైనేజీని నిర్మించి రోడ్డుకు కింది వైపు గృహాల ముందు మిగిలిన స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా బోర్డులు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు సూచించారు. శనివారం ఉదయం పనులు చేపట్టగా మళ్లీ ఆందోళనలు మొదలయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ కొంతదూరం కాలువ తవ్వి వదిలేశారు. అధికారులు రోడ్డు పనుల వద్దకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. శనివారం భారీ వర్షంతో అంబేడ్కర్ చౌరస్తా వద్ద మురుగుకాలువ ప్రమాదకరంగా మారింది. ఇరువర్గాలు ఆందోళన బాట పట్టడంతో రోడ్డు నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.